క్లుప్తంగా

11 నుంచి వాలీబాల్ టోర్నీ

హుకుంపేట: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 11 నుంచి మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు భవానిశంకర్, రామరావు తదితరులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

టోర్నమెంట్‌లో మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు అందజేయనున్నట్టు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు తమ పేర్లు, వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440208662, 6303071368 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ బేసు, ఎంపీటీసీ నాగరాజు

హుకుంపేట: స్వాతంత్య్ర ఉద్యమ పోరాటయోధుడు మర్రికామయ్య వర్ధంతి వేడుకలను మే 5న నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్‌ను సర్పంచ్ పాంగి బేసు, ఎంపీటీసీ సభ్యుడు కొర్ర నాగరాజులు శనివారం టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. యువత క్రీడలపై ఆసక్తి కనబర్చాలన్నారు. వైస్ సర్పంచ్ కిల్లో ఆనంద్, టోర్నమెంట్ నిర్వాహకులు మర్రి కామరాజు, సభ్యులు సీదరి కామరాజు, సతీష్, వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్ల ఏర్పాటు



జి.మాడుగులలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

జి.మాడుగుల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని వీధి దీపాలను శనివారం ఏర్పాటు చేశారు. ఈ పనులను జి.మాడుగుల సర్పంచ్ కిముడు రాంబాబు పర్యవేక్షించారు. వీధి దీపాల ఏర్పాటుతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ఎటపాక: బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు ఈ నెల 7వ తేదీ నుంచి రెండు రోజుల పాటు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాలతో ఎటపాకలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. మండలంలోని రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారు ఈ ఇంటర్వ్యూలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



మృతుడు బ్రహ్మలింగం

సాక్షి, పాడేరు: పాడేరు పట్టణంలో గత 20 ఏళ్ల నుంచి టైలర్ వృత్తి చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న వీరమల్లి బ్రహ్మలింగం(55)అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందారు. పేదవర్గానికి చెందిన బ్రహ్మలింగం మృతికి పలువురు విచారం వ్యక్తం చేశారు. పాడేరు ఉప సర్పంచ్ , పలు రాజకీయ పార్టీల నాయకులు, అన్ని వర్గాల వర్తకులు, వర్తక సంఘం నేతలు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయులు, విశ్వబ్రహ్మణ కుటుంబాలు బ్రహ్మలింగం భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలకు ఆర్థిక సాయాన్ని అందజేసి మానవత్వం చాటుకున్నారు.

ఘన జీవామృతం తయారీపై అవగాహన

కశింకోట: జి.భీమవరం యూనిట్ అడ్డాం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం శాఖ ఆధ్వర్యంలో ఘన జీవామృతం తయారీపై రైతులకు శనివారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వంద కిలోల ఆవు పేడ, మూత్రం, బెల్లం, పప్పుల పిండి వగైరా వినియోగించి పిడకలు తయారు చేసి ఎండబెట్టారు. దీన్ని ఎండిన వారం రోజుల తర్వాత పొడిగా చేసి నిల్వ ఉంచి పంటల సాగు సమయంలో భూముల్లో ఎరువుగా వినియోగిస్తారని రైతులకు అవగాహన కలిగించారు. ప్రకృతి సిద్ధంగా తయారైన ఘన జీవామృతాన్ని ఎరువుగా వినియోగించి పంటలు పండించడం వల్ల ఆరోగ్యకరమైన ఉత్పత్తులు వస్తాయని, వీటిని స్వీకరించడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని సిబ్బంది పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం సీఏ లక్ష్మి, ఎల్–1 రమణ, వెంకట అప్పారావు, నాగలక్ష్మి, ఓటీ ఆదిలక్ష్మి, పాల్గొన్నారు.





ముంచంగిపుట్టులో శ్రీరామ నవమికి విద్యుత్ కాంతులతో ముస్తాబు చేసిన ఆలయం

సీతారాముల కల్యాణం చూతము రారండి



జి.మాడుగులలో ముస్తాబైన రామాలయం



రాజేంద్రపాలెం రామాలయంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్న స్థానికులు

ముంచంగిపుట్టు: శ్రీరామ నవమి వేడుకలకు జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం జరగనున్న సీతారాముల కల్యాణ ఉత్సవానికి రామాలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. విద్యుత్ దీపాలతో ఆలయాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లతో పాటు టెంట్లు సిద్ధం చేశారు. సీతారాముల విగ్రహాలను సంప్రోక్షణ చేసి కల్యాణ వేడుకకు సిద్ధం చేశారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంతో పాటు దొడిపుట్టు, బొంద్రుగూడ, జోలాపుట్టు గ్రామాల్లో శ్రీరామ నవమి పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం నుంచి శ్రీ సీతారాములు కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశారు. మండలంలో నుర్మతి, బందవీధి, జీఎం కొత్తూరు, తదితర గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. జి.మాడుగుల కేంద్రంలోని రామాలయంలో ఆదివారం శ్రీరామనవమి పురస్కరించుకొని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త, మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు తెలిపారు. భద్రాదిని తలపించే విధంగా వేద పండితుల మంత్రోచ్చరణలతో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తారన్నారు. కల్యాణ మహోత్సవం అనంతరం పురవీధుల్లో డప్పు వాయిద్యాలు, థింసా నృత్యాలు, కోలాటాలు నడుమ బాణాసంచా కాల్పులతో ఉత్సవ మూర్తుల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

కొయ్యూరు: శ్రీరామనవమి వేడుకకు పలుచోట్ల రామాలయాలను ముస్తాబు చేశారు. తాటాకులతో చలువ పందిళ్లు ఏర్పాటుచేశారు. ఆలయాలకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. సీతారాముల కల్యాణ మహోత్సవం నేపథ్యంలో ఆలయాల్లో భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రాజేంద్రపాలెంలో భారీ అన్న సమరాధనకు ఏర్పాట్లు పూర్తయినట్టు సర్పంచ్ పి.సింహాచలం తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.



ప్రత్యేకాలంకరణలో సీతారాముల విగ్రహాలు

ఆరోగ్యభద్రతపై అవగాహన



సీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

అడ్డతీగల: గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని అడ్డతీగల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పండా సతీష్ అన్నారు. సీహెచ్‌సీలో శనివారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పండా సతీష్ మాట్లాడుతూ నెలలు నిండిన గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు చేసుకోవాలన్నారు. ఇంటి వద్ద జరిగే ప్రసవాల వల్ల కలిగే నష్టాలను వైద్యాధికారి ప్రసన్నదేవి వివరించారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, జాగ్రత్తలు పాటించడం వల్ల సాధారణ ప్రసవాలు జరుగుతాయన్నారు.శిశువుల్లో రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు తరచూ వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకుంటూ మందులు వాడుకోవాలన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణులు ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని ఆసుపత్రి కౌన్సిలర్ నారె వాసు సూచించారు. గర్భిణులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీడిమామిడి రైతులను ఆదుకోవాలి

రంపచోడవరం: అకాల వర్షాలకు, వాతావరణ మార్పులకు నష్టపోయిన జీడిమామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకెఎంఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు కుంజా దూలయ్య డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది అంతంతమాత్రంగా జీడిమామిడి పూత వచ్చిందని, అకాల వర్షాలకు పిందెలు రాలిపోయాయన్నారు. నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, రుణమాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుపరచాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన జీడిరైతులకు మద్దతుగా సోమవారం రంపచోడవరం ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్టు లచ్చిరెడ్డి తెలిపారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



నెల్లిపూడిలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు, గ్రామస్తులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రంపచోడవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ ప్రకాశరావు



జి.మాడుగులలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో దేవిడ్‌రాజ్

గంగవరం: దళితల కోసం పోరాటం చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన ఎనలేని కృషి చేశారని వైఎస్సార్‌సీపీ రంపచోడవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ తాతపూడి ప్రకాశరావు అన్నారు. డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నెల్లిపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ప్రముఖులు ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి తాతపూడి ప్రకాశరావు అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఉప ప్రధానిగా, అలాగే అనేక మంత్రిత్వ శాఖలకు మంత్రిగా పనిచేశారన్నారు. కుల వివక్షతను తిప్పి కొట్టడంలో జగ్జీవన్‌రామ్ ప్రముఖ పాత్ర పోషించారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పాము అర్జున, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అప్పలరాజు, నెల్లిపూడి ఎంపీటీసీ కనకలక్ష్మి, సర్పంచ్ రమణమ్మ, కో–ఆప్షన్ సభ్యులు ప్రభాకరరావు, నెల్లిపూడి సొసైటీ మాజీ అధ్యక్షుడు ఏసు, తదితరులు ప్రసంగిస్తూ బాబూ జగ్జీవన్‌రామ్ ఉప ప్రధానిగా దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. గ్రామపెద్దలు, వివిధ పార్టీల నాయకులు డి.భానుప్రకాశ్, చిన్ని, అర్జున్న, మునలయ్య, సోమరాజు, భాస్కర్‌రావు, సూరిబాబు, శ్యామ్యూల్, శివ, నాని, శ్రీను, కృష్ణ, మణిబాబు, అప్పారావు, దేవుళ్లు, గణేష్ పాల్గొన్నారు.

అడ్డతీగల: అడ్డతీగలలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని శనివారం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.సమాజంలో అసమానతలు తొలగిపోవాలని నిరంతరం పోరాటం చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని దంగేటి సత్తిబాబు అన్నారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: బడుగుల, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటం చేసిన మహనీయుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎంపీడీవో డెవిడ్‌రాజ్ తెలిపారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కుల వివక్షను నిర్మూలించిన ఎంతో సేవ చేశారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ డేవిడ్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అడ్డతీగలలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

కొయ్యూరు: అంగన్‌వాడీ మినీ కార్యకర్తల నియామకానికి చర్యలు తీసుకుంటున్నట్టు సీడీపీవో విజయకుమారి తెలిపారు. యూ.చీడిపాలెం, ఆడాకుల పంచాయతీలో డి.కొత్తూరు, ఎం.భీమవరం పంచాయతీలో వాలుగూడెం, కినపర్తి పంచాయతీలో ములగలమెట్టలో ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. బూదరాళ్ల పంచాయతీ రాజులపాడుల అంగన్‌వాడీ ఆయాల పోస్టులను భర్తీ చేస్తామన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 21 ఏళ్ల నుంచి 35 సంవత్సరాలలోపు కలిగి ఉండాలని, వివాహితలైన, స్థానికంగా నివాసం కలిగిన వారు అర్హులుగా పేర్కొన్నారు. దరఖాస్తులను సీడీపీవో కార్యాలయంలో ఈనెల 10వ తేదీలోగా అందజేయాలని పేర్కొన్నారు.

అడ్డతీగల: అడ్డతీగల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జి సీడీపీవో సీహెచ్. లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.అడ్డతీగల–2 అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టు ఖాళీగా ఉందన్నారు. చాకిరేవుల, సువ్వగంటిపాలెం మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కర్ల పోస్టులకు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి విజయ్ తెలిపారు. అర్హులైన వారు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ముంచంగిపుట్టు: అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీవో వరహాలమ్మ తెలిపారు. మండలంలో 11 అంగన్‌వాడీ పోస్టుల ఖాళీలున్నట్టు ప్రకటనలో తెలిపారు. జోడిగుమ్మ, మద్దులమంధ అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు, తలబిరాడ, రాంపుట్టు, కుర్రాయిపుట్టు గ్రామాల్లో మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, పట్నపడాల్‌పుట్టు, దేగలపుట్టు, గాజులబంధ, ఏడుకొండలబంద, బంగురుపల్లి, మల్లేపోదర్ గ్రామాల్లో అంగన్‌వాడీ సహాయకురాలుగా ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఆయా పోస్టులకు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 21 ఏళ్ల నుంచి 35 సంవత్సరాలలోపు కలిగి ఉండాలని, వివాహితలైన, స్థానికంగా నివాసం కలిగిన వారు అర్హులుగా పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

రంపచోడవరం: రంపచోడవరం ఐసీడీఎస్ పరిధిలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీ ఉత్తర్వులు విడుదల చేసినట్టు సీడీపీవో సంధ్యారాణి తెలిపారు. రంపచోడవరం మండలంలో ఎం.బూరుగుబంద మినీ అంగన్‌వాడీ కార్యకర్త, ఇసుకపట్ల, రంపలలో సహాయకురాలు, దేవీపట్నం మండలంలోని దేవారంలో అంగన్‌వాడీ కార్యకర్త, దండంగి, తొయ్యేరు, సీహెచ్.భీంపల్లిలో సహాయకురాలు పోస్టులు ఖాళీ ఉన్నట్టు తెలిపారు.

అర్హులైన అభ్యర్థులు ఈ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు రంపచోడవరం లోని ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

1/70 చట్టం పటిష్టంగా అమలుచేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న శాంతకుమారి

అరకులోయటౌన్: అరకులోయలో ఈనెల 7న పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గిరిజన ప్రాంతంలో ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి చెప్పారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ప్రధానమైన జీవో నంబర్–3కు చట్టబద్ధత కల్పించాలన్నారు. 1/70వ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. గిరిజన ప్రాంతంలోని ఆశ్రమ పాఠశాలల్లో సుమారు 1200 మంది హెల్త్ వలంటీర్ల సర్వీసులను కొనసాగించాలని అనంతగిరి, చింతపల్లి మండలాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని, గిరిజన అభ్యర్థుల కోసం స్పెషల్ డీఎస్సీ నోటిఫికేష విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతగిరి మండలం నాన్ షెడ్యూల్ ఏరియాలోని 5 పంచాయతీలను ఐటీడీఏ పరిధిలో కలపాలన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రవీణ్, గంగాధర్, బాబూరావు, మితుల, పాచిపెంట మాలతి పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



సచివాలయ కార్యదర్శి కృష్ణస్వామిని సన్మానిస్తున్న సర్పంచ్ అక్కమ్మ తదితరులు



పంచాయతీ కార్యదర్శి అజయ్‌ను సన్మానిస్తున్న సర్పంచ్‌లు శివ, కామరాజు తదితరులు

గంగవరం : బదిలీపై వెళ్తున్న సూరంపాలెం, గంగవరం గ్రామ కార్యదర్శులు మద్దూరి అజయ్, ఎం.కృష్ణస్వామిలను సర్పంచ్‌లు, గ్రామ సచివాలయ, పంచాయతీ సిబ్బంది ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గంగవరంలో సర్పంచ్ కలుముల అక్కమ్మ అధ్యక్షతన శనివారం జరిగిన కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎం.కృష్ణస్వామితో పాటు పదోన్నతులు పొందిన రామలత, రెహానా సుల్తానాలను ఘనంగా సన్మానించారు. ఉప సర్పంచ్ పరదా వెంకటేశ్వరరావు దొర, మండలపరిషత్ మాజీ కో–ఆప్షన్ సభ్యుడు కొమ్మన చిన్నారావు తదతరులు పాల్గొన్నారు. సూరంపాలెంలో సర్పంచ్ శివదొర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మద్దూరి అజయ్‌ను కొత్తాడ సర్పంచ్ సారపు కామరాజు దొర, సూరంపాలెం ఉప సర్పంచ్ కోసు బాపన్న తదితరులు సన్మానించారు. పీసా కమిటీ ఉపాధ్యక్షుడు, కార్యదర్శి దొంగబాబు, బాలు, మాజీ సర్పంచ్ నారాయణరావు తదితరులు మాట్లాడుతూ గ్రామ కార్యదర్శి అజయ్ సేవలను కొనియాడారు.

చిరంజీవిదొర సేవలు మరువలేనివి



చిరంజీవిదొర భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు సీకరి చిరంజీవిదొర(60) మృతికి అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సంతాపం తెలిపారు. సీకరిలో శనివారం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. చిరంజీవిదొర పార్థీవదేహం వద్ద అంజలి ఘటించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చరు. సీకరి పంచాయతీ అభివృద్ధికి చిరంజీవిదొర కృషి చేశారని, ఆయన సేవలు మరువలేనివన్నారు. అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు స్వామి, వెంకటరమణ, రాంప్రసాద్, సర్పంచ్ కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యుడు ఆనందరావు తదితరులున్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహాల ప్రతిష్ట



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తదితరులు

అడ్డతీగల: మండలంలోని మట్లపాడులో శనివారం గ్రామస్తులు నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన వైభవోపేతంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఈ కార్యక్రమంలో పాల్గొని సీతారాముల వారికి విశేష పూజాధికాలు నిర్వహించారు. అనంతరం హోమం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. ఆలయ సమీపంలోని అభయాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. కార్యక్రమాల అనంతరం అన్న ప్రసాద వితరణ గావించారు. ఎంపీపీ బొడ్డపాట రాఘవ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సుందర రాముడికి పట్టువస్త్రాల సమర్పణ



ఆలయ అర్చకులకు పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న దృశ్యం

వీఆర్‌పురం: శ్రీరామగిరిలో జరిగే సుందర సీతారామ స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవం సందర్భంగా రేఖపల్లికి చెందిన ఏఎస్‌డీఎస్ సంస్థ వ్యవస్థాపకుడు, మాజీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు ఉండవల్లి గాంధీబాబు దంపతులు శనివారం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెందుర్తి సుదర్శన్‌రావు ఆలయ ప్రధాన అర్చకులు పురుషోత్తమాచార్యులు తదితరులు పాల్గొన్నారు

ఎట్టకేలకు బస్‌షెల్టర్‌లో చెత్త తొలగింపు



మద్యం బాటిళ్లతో నిండిన పెదబయలు బస్ షెల్టర్ (నాడు)



బస్‌షెల్టర్‌ను శుభ్రం చేసిన దృశ్యం (నేడు)

సాక్షి ఎఫెక్ట్..

పెదబయలు: పెదబయలు ప్రధాన కూడలి ప్రాంతానికి ఆనుకుని ఉన్న ఆర్టీసీ బస్సు షెల్టర్ వద్ద శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. 'సాక్షి'లో ఈనెల 5న 'మందుబాబులకు అడ్డాగా బస్ షెల్టర్' శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు సీతగుంట గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి బస్సు షెల్టర్ వద్ద పేరుకుపోయిన మద్యం సీసాలు, ప్లాస్టిక్ డిస్పోజబుల్ గ్లాసులు ఇతర చెత్తను తొలగించారు. షెల్టర్ లోపల బ్లీచింగ్ పౌడర్‌ను చల్లి శుభ్రం చేశారు. అలాగే స్థానిక ఎస్ఐ రమణ 'సాక్షి'తో మాట్లాడుతూ బహిరంగా ప్రదేశాలు, బస్సు షెల్టర్‌లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ముఖ్యంగా మహిళలు ఇబ్బంది పడే విధంగా మందుబాబులు ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.